# వేసవిలో నిరంతర విద్యుత్ అందించాలి

## ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



### ముందస్తు ప్రణాళికలతో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలి

### ట్రాన్స్కో అధికారులకు కలెక్టర్ ఆదేశం

**మెదక్ ప్రతినిధి, మార్చి 16 సిరి న్యూస్:**
రానున్న వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని మంబోజి పల్లి ఏరియాలో 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా ఇన్ పుట్, ఔట్ పుట్ గురించి, ట్రాన్స్ ఫార్మర్లు, ఫీడర్ల గురించి విద్యుత్ శాఖ ఎస్సీ శంకరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగంపెరుగుతుందని అందుకు అనుగుణంగాఎలాంటిఅంతరా యం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశమున్నందున, ముందస్తు ప్రణాళికలతో అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, ఇతర సాంకేతిక పరంగా ఎదురయ్యే అంశాలలో లోపాలు ఉంటే వెంటనే సరిచేసి, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచడం, లోడ్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం వంటి చర్యలను అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో 33/11 కెవి ఉప విద్యుత్ కేంద్రాలు 126 ఉన్నాయని, వాటి పరిధిలో ప్రతి రోజు విద్యుత్తు వినియోగం నమోదులు చేయాలని ఆదేశించారు. సిబ్బంది చాలా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక, గృహ వినియోగ దారులకు అంతరాయం లేకుండా 24 గంటలు నిరంతరాయ సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఎస్ ఈ శంకర్ తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 18న జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

**రామాయంపేట మార్చి 16 (సిరి న్యూస్)**



ఈ నెల 18వ తేదీన 2025 – 2028 కాలపరిమితికి గాను జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు తూప్రాన్ పట్టణంలోని దేవీ గార్డెన్స్ లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి సోమయాజుల రవీంద్ర శర్మ, సహాయ ఎన్నికల అధికారులు శాస్త్రుల మధుశ్రీ శర్మ, డి.జి.శ్రీనివాస శర్మ తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని.ఆ రోజు జిల్లా సంఘంలో సభ్యత్వం ఉన్నవారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని తెలిపారు.
జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికల షెడ్యూలును వారు ప్రకటించారు. 18.03.2025 రోజున ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 1.30 నుంచి 2.00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన,మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 3.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ,3.00 గంటల నుంచి 3.15 గంటల వరకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సాయంత్రం 3.15 నుంచి 4.00 గంటల వరకు ఎన్నికల సమయం,4.00 నుంచి 4.30 వరకు ఓట్ల లెక్కింపు, సాయంత్రం 5.00గంటలకు ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు.తదుపరి ధృవపత్రాల అందజేత, ఎన్నికైన వారిచేత ప్రమాణ స్వీకారం చేయించడం జరుగుతుందని వారు తెలిపారు.

# అరగంట వ్యవధిలో భార్య, భర్త బలవన్మరణాలు

## అనాథలైన నలుగురు చిన్నారులు

**సిద్దిపేట, మార్చి 16 (సిరి న్యూస్)**
రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. రోజూ కూలీ పనులు చేస్తుంటారు. ఆర్థిక పరిస్థితులతో కుటుంబ పోషణ భారమై దంపతుల మధ్య కలహాలకు దారితీసింది. భర్త మందలించాడని మనస్తాపంతో భార్య ఆత్మహత్య చేసుకోగా.. అరగంటలోపే భర్త కూడా బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తొగుట ఎస్ఐ రవికాంతరావు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన కెమ్మసారం నాగరాజు (40)కు పదేళ్ల కిందట రేణుకతో వివాహమై ఇద్దరు పిల్లలు కలిగారు. ఆరేళ్ల క్రితం కుటుంబ కలహాలతో ఆమె ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భాగ్యలక్ష్మి(35)తో నాగరాజుకు రెండో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు లక్కీ, శ్రావణ్ జన్మించారు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకోలేక దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి గొడవ కాగా భాగ్యలక్ష్మి పురుగు మందు తాగింది. ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మనస్తాపానికి గురైన నాగరాజు.. సిద్దిపేటలో పురుగుమందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తల్లిదండ్రులను కోల్పోయి నలుగురు పిల్లలు అనాథలు కావడంతో గ్రామంలో తీవ్రవిషాదం నెలకొంది.

# ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

**సంగారెడ్డి, మార్చి 16 ( సిరి న్యూస్)**



సంగారెడ్డి బైపాస్ రహదారిలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ కొక్కొండ శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శత కలశార్చన కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి అరుణ్ గురు స్వామి ఆత్రంలో మహా పడిపూజ కార్యక్రమం జరిగింది. పట్టణ గురుస్వామి జయ ప్రకాష్, శ్రీశైలం గౌడ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, కోశాధికారి సాగర్, సభ్యులు అరుణ్ కుమార్, శేషగిరి రావు, గోపాల్, ప్రసాద్ వీర్ కుమార్ పాల్గొన్నారు.

# సఫాయి కార్మికుడికి ఆర్థిక సాయం అందించిన అయిత పరంజ్యోతి

**చేగుంట, మార్చి 17 సిరి న్యూస్**



చేగుంట పట్టణానికి చెందిన మేజర్ గ్రామపంచాయతీ సపాయి కార్మికుడు ఎర్ర రమేష్ (32) అనారోగ్యంతో రాత్రి మరణించాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు పరంజ్యోతి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ఎర్ర యాదగిరి, బక్క దశరథం, నాగరాజు, సాయిబాబా, పొట్టి గణేష్, దుర్గయ్య, మైసయ్య, చంద్రయ్య, బాలు, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

# రచన్న పటేల్ మరణం పార్టీకి తీరని లోటు

**ఝరాసంగం మార్చి 16 సిరి న్యూస్ :**
ఝరాసంగం మండల పరిధిలోని కప్పాడ్ గ్రామ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు రచన్న పటేల్ కప్పా డ్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్మల్కాపురం శివకుమార్,బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం,కేతకి ఆలయ మాజీ చైర్మన్ నర్సింహా గౌడ్ ఆస్పత్రి కి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన అకాలమరణం చెందడంతో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.